క్లుప్తంగా

గ్రావెల్ తోలకాల అడ్డగింత

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు పంచాయతీలో గత వారం రోజులుగా యథేచ్ఛగా తోలుతున్న అక్రమ గ్రావెల్ తోలకాన్ని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు అడ్డుకున్నారు. ములకపాడు పంచాయతీలోని ఓ నిర్మాణానికి సంబంధించి తహసీల్దార్ అనుమతులు ఇచ్చారంటూ పగలు మితిమీరిన వేగంతో ట్రాక్టర్లలో గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రావెల్ తోలకాలను నిలిపివేసి ఘటన స్థలం నుంచి ఏఎస్పీ డివిజన్ నాయకుడు సొందె మల్లూరు తహసీల్దార్ అశోక్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వారి సొంత స్థలం నుంచి గ్రావెల్ తోలకాలకు అనుమతి ఇచ్చినట్టు తహసీల్దార్ తెలిపారని అన్నారు. కార్యక్రమంలో తెల్లం భీమరాజు, ఉబ్బా మోహన్, పూసం చిన్నారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల కమిటీల నియామకం

భద్రాచలంటౌన్: బీఆర్ఎస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి పునర్ నిర్మాణం చేసేందుకు పూర్తి స్థాయి మండల కమిటీలతో పాటు అనుబంధ సంఘాలను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పలు మండలాలకు నియమించిన కమిటీల కన్వీనర్లు, కో–కన్వీనర్ల పేర్లను ఆయన వెల్లడించారు. భద్రాచలంటౌన్ కన్వీనర్‌గా ఆకోజు సునీల్ కుమార్, కో–కన్వీనర్‌గా రేపాక పూర్ణచందర్ రావు, దుమ్ముగూడెం మండల కన్వీనర్‌గా కనితి రాముడు, కో–కన్వీనర్‌గా ఎండీ.జానీ, చర్ల మండల కన్వీనర్‌గా దొడ్డి తాతారావు, కో–కన్వీనర్‌గా ఐనవోలు పవన్‌కుమార్, మణుగూరు మండల కన్వీనర్‌గా కురి నాగేశ్వరరావు, కో–కన్వీనర్‌గా బొలిశెట్టి నవీన్, మణుగూరు టౌన్ కన్వీనర్‌గా కుంట లక్ష్మణ్, కో–కన్వీనర్‌గా నూకారపు రమేష్‌లను నియమించిన్నట్లు ఆయన ప్రకటించారు.

ముఖ్యమంత్రికి వినతిపత్రం

చర్ల: భద్రాచలం ఏజెన్సీలో పలు సమస్యలపై తెలంగాణా జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేసినట్లు టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి గోపగాని శంకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. భద్రాచలం నుంచి చర్ల మీదుగా వాజేడు మండలంలోని జగన్నాథపురం వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మించడం, చర్ల మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడం, చర్ల మండలంలోని వద్దిపేట సమీపంలో గల తాలిపేరు వాగుపై చెక్‌డ్యాం నిర్మించి మండలంలోని 18 గ్రామాల్లోని చెరువులు, కుంటలు నింపడం తదితర ప్రధాన సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు శంకర్‌రావు తెలిపారు. సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు శంకర్‌రావు తెలిపారు.

సీఐటీయూలో చేరిక

చర్ల: పలువురు మిషన్ భగీరథ కార్మికులు బుధవారం సీఐటీయూలో చేరారు. వివిధ కార్మిక సంఘాల్లో పనిచేస్తున్న వీరంతా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మాచారి సమక్షంలో సీఐటీయూలో చేరగా.. వారందరికీ ఆయన సీఐటీయూ జెండాలు కప్పి కార్మిక సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రహ్మాచారి మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ రాజీ లేని పోరాటాలు సాగిస్తోందని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పాయం రాధాకుమారి, మండల నాయకులు పామారు బాలాజీ, కార్మికులు పృథ్వీ, విద్యాసాగర్, కిశోర్, ప్రశాంత్, నవీన్, విష్ణు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ అందజేత

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు బుధవారం ఉచితంగా నోట్ బుక్స్‌ను అందించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సారాపాక ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని 58 ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన నోట్ బుక్స్‌ను వితరణగా అందించగా.. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు స్థానిక ఎంఈఓ ప్రసాదరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. హెచ్ఎంలు, టీచర్లు, మండల కోఆర్డినేటర్ రమేష్, మహబూబ్, సీఆర్పీలు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటుతాం

కరకగూడెం: రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేసి సత్తాచాటుతుందని ఆ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ హడాక్ కమిటీ కన్వీనర్ కొండపల్లి రామచందర్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో టీడీపీ పార్టీ మండల అధ్యక్షుడు సిరిశెట్టి కమలాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ పినపాక నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హడాక్ కమిటీ సభ్యులు వట్టం నారాయణ,పోటు రాంగారావు, వాసిరెడ్డి చలపతిరావు, బూర్గంపాడు, గుండాల, పినపాక, ఆళ్లపల్లి మండలాల అధ్యక్షుడు జగదీశ్వరారావు, తోలెం సాంబయ్య, తోట వెంకటేశ్వరారావు, పరమేశ్వరచారి, మాజీ సర్పంచ్ భారతి, నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే ప్రారంభం

- తొలిరోజు వివరాలు నమోదు చేసిన ఎన్యూమరేటర్లు
- సర్వే తీరును పరిశీలించిన ఉన్నత అధికారులు


అశ్వారావుపేటరూరల్: సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్


మణుగూరురూరల్: సర్వేను పర్యవేక్షిస్తున్న మండల అధికారులు


కరకగూడెం: ఇంటికి స్టిక్కర్ వేస్తున్న ఆర్ఐ, సిబ్బంది

బూర్గంపాడు: ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు, కుల గణన కోసం ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వే మండలంలో బుధవారం ప్రారంభమైంది. మండలంలో 120 మంది ఎన్యూమరేటర్లు తొలిరోజు హౌస్‌లిస్టింగ్ కార్యక్రమం చేపట్టారు. 12మంది సూపర్‌వైజర్లు హౌస్ లిస్టింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డిలు సర్వే తీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీఓ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని ప్రతీ ఒక్క ఇంటిని సమగ్ర కుటుంబ సర్వే చేయాలని మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావులు ఎన్యూమరేటర్లకు సూచించారు. మండలంలోని బుగ్గ, రేగులగండి తదితర గ్రామాల్లో ఎన్యూమరేటర్లు చేపడుతున్న సర్వే కార్యక్రమాన్ని వారు సందర్శించి పర్యవేక్షించారు. సర్వేలో నమోదు చేస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి అశ్వారావుపేట మండల వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్వేలో భాగంగా తొలి రోజు ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన బ్లాక్‌ల వారిగా ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అంటించి, గృహాలను గుర్తించే పనులు చేపట్టారు. కాగా, ఈ సర్వే ప్రక్రియను జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా మండల కేంద్రంలోని ముస్లిం బజార్, శివయ్య బజార్‌లో, అలాగే స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ వేర్వేరుగా వెళ్లి స్వయంగా పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ సోయం ప్రసాద్, ఇతర సిబ్బంది ఉన్నారు.

కరకగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే బుధవారం మండలంలో ప్రారంభమైంది. ఈ మేరకు 35 ఎన్యూమరేటర్లు, నలుగురు సూపర్ వైజర్లు, పలు గ్రామ పంచాయతీల కార్యదర్శులు సర్వేలో పాల్గొని కుటుంబాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. అంతేకాకుండా ఇంటింటికి వెళ్లి ఎన్ని కుటుంబాలు ఉన్నాయో గుర్తించి స్టిక్కర్లు అతికించారు. అలాగే ఈనెల 9న వివరాలు నమోదు చేస్తామని సమగ్ర కుటుంబ సర్వేలో ఏయే అంశాలు చెప్పాలో ప్రజలకు అవగాహన కల్పించారు. కాగా కరకగూడెం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్ క్షేత్రస్థాయిలో సర్వేను పర్యవేక్షిస్తూ సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు.

విద్యార్థినికి సన్మానం


గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థినిని సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్ర

చర్ల: స్థానిక ప్రభుత జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న మడకం శ్రీ విద్య ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన అథ్లెటిక్ హార్డిల్స్‌లో 800 మీటర్ల పోటీలో గోల్డ్ మెడల్ సాధించడంపై బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థినిని ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్ర అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందించిన సీఐ..

అథ్లెటిక్ హార్డిల్స్‌లో 800 మీటర్ల పోటీలో గోల్డ్ మెడల్ సాధించిన మడకం శ్రీవిద్యను చర్ల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ.రాజువర్మ అభినందించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించిన సీఐ పోలీస్ శాఖ తరుపున సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నర్సిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


మణుగూరుటౌన్: ఆర్థిక సాయం అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని విఠల్‌రావునగర్‌కు చెందిన దేశభక్తి మల్లేశ్వరి అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. వారి కుటుంబానికి బుధవారం తహసీల్దార్ రాఘవరెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది చేత ఆ నగదును వారి నివాసానికి సిబ్బంది వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు కృష్ణ లీలావతి, తదితరులు ఉన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మొద్దులమడ గ్రామానికి చెందిన కాక వీరయ్య పూరిల్లు రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన సంగతి తెలిసిందే. దీంతో బాధిత కుటుంబానికి బుధవారం వినాయకపురం గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిత్యావసరాలు, 50 కేజీల బియ్యం, వంట సామగ్రి, దుస్తువులు, దుప్పట్లు, కూరగాయాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పండా రాజు, లోకం సాంబశివరావు, కాక సత్యం, కాక మధు, జెడ్డి కోటేష్, కాక చంద్రం పాల్గొన్నారు.

'గాలికుంటు' నివారణ టీకాలు


కరకగూడెం:పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

కరకగూడెం: మండల వ్యాప్తంగా పశువుల్లో 'గాలికుంటు'వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని వెంకటాపురం, రఘునాథపాలెం గ్రామాల్లో స్థానిక పశువైద్యాధికారిని జాటోత్ వాసంతి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గాలికుంటు వ్యాధి టీకాలతోనే నయమవుతుందని పాడి రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు 350 పశువులకు టీకాలను వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంపై వ్యాఖ్యలు సరికాదు

అశ్వాపురం: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుచేస్తున్న తమ ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరగంటి రమేష్ పాల్గొన్నారు.

చుట్టాలుగా మారిన చట్టాలు

చర్ల: ఏజెన్సీలో చట్టాలు భూస్వాములకు చుట్టాలుగా మారాయని, పేదలు ఎప్పటికీ పేదలుగానే ఉంటున్నారని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి, సమీపంలో గోదావరి లంకల్లో ఉన్న కోరెగడ్డ ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం చర్లలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడారు.

సభ జయప్రదానికి బైక్ ర్యాలీ


కాచనపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గుండాల: ఈనెల 8వ తేదీన కాచనపల్లిలో జరిగే అమరవీరుల వర్ధంతి సభను జయప్రదం చేయాలని న్యూడెమొక్రసీ కార్యవర్గ సభ్యుడు ఆవునూరి మధు కోరారు. ఈ మేరకు బుధవారం కాచనపల్లి గ్రామంలో మోటార్ సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. కాచనపల్లి అమరవీరుల స్తూపం వద్ద జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బట్టు ప్రసాద్, డివిజన్ నాయకులు అటికం శేఖర్, మండల నాయకులు జర్పుల కిషన్, పీవైఎల్ మండల కార్యదర్శి ఏనగంటి లాజర్, అరుణోదయ జిల్లా కార్యదర్శి ఏనగంటి చిరంజీవి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరప రాజేష్, రాందాసు, సత్యం, తాటి రామకృష్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ములకలపల్లి: మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎనీమియా ముక్త్ తెలంగాణా కార్యక్రమంలో బబుగాంగా విద్యార్థులకు హిమోగ్లోబిన్ టెస్ట్‌లు చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐరన్ ఫోలిక్ మాత్రలు మింగించారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ సునీత, ఏఎన్ఎం మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వీరస్వామి సంస్మరణ సభ

ములకలపల్లి: అమర వీరుల ఆశయ సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యవర్గ సభ్యులు నూపా భాస్కర్, కల్లూరి కిషోర్ పిలుపునిచ్చారు. పాగుండాలపాడు జీపీ పరిధిలోని పగడాలనగర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన పొడియం వీరస్వామి సంస్మరణ సభలో పాల్గొన్న వారు మాట్లాడారు. కారం వెంకటేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు నిమ్మల రాంబాబు, మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, నూపా సరోజిని, పుష్పాల నాగేశ్వరరావు, ఎలకం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

అశ్వారావుపేటరూరల్: బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి, ఇటీవలె జరిగిన బదిలీల్లో భాగంగా వెళ్లిన ఉపాధ్యాయులకు పాఠశాల హెచ్ఎం హరిత ఆధ్వర్యంలో ఘన సన్మానం చేసి వీడ్కోలు పలికారు. అదే విధంగా ఇతర పాఠశాలల నుంచి బదిలీపై స్థానిక పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. ఎంఈఓ ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు, సీఆర్పీ ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

పార్టీ పునర్‌వైభవానికి కృషి చేయాలి

మణుగూరురూరల్: బీఆర్ఎస్ పునర్‌వైభవానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ, అనుబంధ సంఘాల నూతన కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడానికి అవకాశముందని పేర్కొన్నారు. ఇదే సమయాన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని, గ్యారంటీల అమలుకు ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. కాగా, సీనియర్ నాయకుల సమన్వయంతో తాత్కాలిక కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు, సభ్యత్వ నమోదు తర్వాత పూర్తి స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మణుగూరు మండల కన్వీనర్‌గా కుర్రి నాగేశ్వరరావు, కోకన్వీనర్‌గా బొలిశెట్టి నవీన్, పట్టణ కన్వీనర్‌గా కుంటా లక్ష్మణ్, కోకన్వీనర్‌గా నూకారపు లక్ష్మణ్‌తో పాటు భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల కన్వీనర్, కోకన్వీనర్లను నియమించినట్లు తెలిపారు.

గ్రామ సభల ద్వారానే ఎంపిక చేయాలి

చర్ల: ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులను గ్రామ సభల ద్వారానే ఎంపిక చేయాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం ఎంపీడీఓ ఈదయ్యకు ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్దయర్శి మచ్చా రామారావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన అన్నారు. కారం నరేష్, బందెల చంటి, బండారు నర్సయ్య, హరానిగవర్మ పాల్గొన్నారు.

అభివృద్ధి విషయంలో రాజీలేదు..


మార్చురీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని, ఈ విషయంలో ఏలాంటి రాజీలేదని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. బుధవారం అశ్వారావుపేట మండలంలో విస్తృతంగా పర్యటించి రూ.కోటి 34లక్షల 80వేలతో మంజూరైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ముందుగా అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో రూ.24.50లక్షల వ్యయంతో నిర్మించే ఆధునాతన మార్చురీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, పాకలగూడెం, గుంటిమడుగు, నారాయణపురం, సూర్యంపేట, చెన్నాపురం, కావడిగుండ్ల, గోపన్నగూడెం గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు, ప్రహరీ గోడలు, సీసీ రోడ్లు, రిటర్నింగ్ వాల్, వంటషెడ్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. అలాగే సూర్యంపేట గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించి, నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు.

మొద్దులమడ గ్రామంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించి, గృహ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు. ఊట్లపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి రైతు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్‌గా రూ.500 అందిస్తుందని, రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంఈఓ ప్రసాదరావు, పీఆర్ డీఈఈ శ్రీధర్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్, మొగ్గళ్లపు చెన్నకేశవరావు, సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, వేముల భారతి, నండ్రు రమేష్, హరి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మేడ ప్రసాద్

మణుగూరుటౌన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మేడప్రసాద్ సూచించారు. బుధవారం పట్టణంలోని 14 టైర్ల లారీ ఓనర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. అపరిచిత కాల్స్‌కు స్పందించాల్సిన విధానంతో పాటు ఓటీపీ అడిగితే వ్యవహరించాలిస్న తీరును వివరించారు. ఆన్‌లైన్ లింక్‌లు క్లిక్ చేయడం వల్ల బ్యాంకు ఖాతాలు ఖాళీ అయిన వారిని ఉదహరిస్తూ సంపూర్ణ అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్ఐ రంజిత్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీ నూతన కార్యవర్గం ఎన్నిక

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీ ఏఐటీయూసీ నూతన కార్యవర్గాన్ని బుధవారం సారపాకలో ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ 13వ మండల మహాసభలలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా ఎండీ.సాజిద్, ప్రధాన కార్యదర్శిగా సింగమనేని ప్రసాద్‌రావులను ఎన్నుకున్నారు. వీరితో పాటుగా మరో 20మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ మహాసభలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, నరాటి ప్రసాద్, మల్లికార్జున్, మువ్వ వెంకటేశ్వరరావు, పేరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఆడిట్ షురూ..


రికార్డులను పరిశీలిస్తున్న ఆడిట్ బృందం సభ్యులు

దుమ్ముగూడెం: మండలంలోని ఉపాధి హామీ పనుల ఆడిట్ నిర్వహించడానికి ఎస్ఆర్‌పీ కుమార్ ఆధ్వర్యంలో ఆడిట్ బృందం సభ్యులు మండలానికి చేరుకున్నారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీలలో 2023–24 సంవత్సరానికి గాను చేపట్టిన రూ.8.22కోట్లకు సంబంధించి 800 పనులపై ఆడిట్‌ను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రికార్డులను తీసుకుని వాటిని పరిశీలిస్తున్నారు. 15 రోజుల పాటు ఆడిట్ నిర్వహించనున్నారు.

బీమా సౌకర్యాలను వినియోగించుకోవాలి

ములకలపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా సౌకర్యాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎస్‌బీఐ పూసుగూడెం బ్రాంచ్ మేనేజర్ రాజేంద్రనాయక్ సూచించారు.

మండలపరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. జీవిత భీమా చాలా అవసరమని అన్నారు. హెచ్ఎం.రమేశ్ రాథోడ్, ఉపాధ్యాయుడు కిషన్, జీపీ సెక్రటరీ కార్తీక్, ఏఎస్ఎం సీత, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు పోరాడాలి

గుండాల: భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడి అమరులైన వారి ఆశయ సాధన కోసం ఉద్యమించాలని ప్రజాపంథా జిల్లా నాయకులు మాచర్ల సత్యం పిలుపునిచ్చారు. సీపీఐ (ఎంఎల్) మాస్లైన్ ఆళ్లపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మర్కోడ్ సెంటర్‌లో అమరవీరుల వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. అమరుడు పాయం లక్ష్మన్న స్తూపం వద్ద నివాళులర్పించి, అమరవీరులకు జోహార్లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాస్లైన్ డివిజన్ కార్యదర్శి ఈసం శంకర్, జిల్లా నాయకులు వాంకుడోత్ అజయ్, గుండాల మండల కార్యదర్శి కొమరం శాంతయ్య, ఈసం సమ్మయ్య, ఏడుళ్ల రామనాథం, పాయం బాబురావు, బొమ్మల గౌరయ్య, పూనెం రామయ్య, గొగ్గల భరత్, ఈసం ఈసం చంద్రయ్య, యనగంటి గణేష్, కల్తి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

చంద్రుగొండ: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి జీవనంలో భాగం కావాలని తెలంగాణ మలిదశ ఉద్యమ రాష్ట్ర నాయకుడు తాళాడ్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆయన బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ సర్పంచ్ గుగులోతు రమేష్, బీఆర్ఎస్ నాయకులు అల్లం గాంధీ, రామారావు, ఎస్‌కె.అబ్దుల్, కిరణ్ పాల్గొన్నారు.

దీక్ష స్వీకరణ


భద్రాచలం హరిహర క్షేత్రంలో అయ్యప్ప దీక్షను స్వీకరిస్తున్న స్వాములు

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయం కార్తీక మాస మొదటి బుధవారం కావడంతో అత్యంత భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామి మాల దీక్షాపరులతో అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. ఒక్క రోజే 800 మంది భక్తులు మాల స్వీకరించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి మాల దీక్షా స్వాములతో ఆలయ ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. గత మూడు రోజులుగా సుమారు 1500 మంది దీక్ష స్వీకరించారు. అనంతరం 8:30 గంటల నుంచి శ్రీ అయ్యప్ప స్వామి వారికి ఆలయ నంబూద్రి అరుణ్ రామచంద్రన్ నేతృత్వంలో ప్రత్యేక అభిషేకం, అలంకరణ చేపట్టారు. ఆలయ అర్చకులు కొత్తలంక సంతోష్ శర్మ ఆధ్వర్యంలో గణేశుడికి పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యుత్ సదుపాయం కల్పించాలని ధర్నా


అటవీరేంజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పోడుదారులు

చంద్రుగొండ: పోడుభూముల్లో త్రీఫేస్ విద్యుత్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ అన్నపురెడ్డిపల్లి మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన 30 మంది పోడురైతులు చంద్రుగొండలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. మొదట పోడుభూముల్లో విద్యుత్ సదుపాయానికి అనుమతి ఇవ్వాలని రేంజర్ ఎల్లయ్యను కోరారు. విద్యుత్ సదుపాయానికి అనుమతి ఇచ్చే అర్హత తనకు లేదని ఆయన తేల్చిచెప్పారు. సోలార్ సెట్లు అమర్చుకోవాలని ఆయన సూచించారు. దీంతో పోడుదారులు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. 37 మందికి 90 ఎకరాలకు పోడు పట్టాలు వచ్చాయని చెప్పారు. ఆ భూముల్లో 15 బోరుబావులు వేసుకున్నామని, మోటార్లు అమర్చేందుకు విద్యుత్ అవసరం ఉందన్నారు. ఆందోళనకు పోడుదారులు జవాది వీరభద్రం, మడివి కృష్ణ, మడివి రాజు, సున్నం శ్రీను, చీతం రామలక్ష్మి నాయకత్వం వహించారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండంత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎన్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416